

# ఆమె మనసు

శ్రీ 'విజయ-రాఘవ'

శ్రీధరం చెట్టుక్రింద వకీలు వృత్తి చేయడానికి బి. ఎ బియల్. ప్యాసయినాడు. కాని దానిమీద జీవసం గడపడం ఒకరకంగా అవమానమనిపించింది. పగలల్లా ఆ చెట్టుక్రిందా - ఆ చెట్టుక్రిందా పడిగాపులుపడి కలంలో సిరా అర్యేదాకా తెల్లకాగితాల్ని నల్లబరచి - పదిమందితో అబద్ధాలాడించగా - వచ్చేముష్ఠి ముప్పయి రూపాయిల్తో యిద్దరు బ్రతకాలి. తను గాకుండా అద్దైనా వారానికి రెండు సార్లో ఒకసారో. అంతే సలభైయేళ్లు ముంచుకొచ్చేసరికి స్వేచ్ఛగా బ్రతకాలనిపించింది. ఈ స్వేచ్ఛను చిన్నప్పటినుంచీ కోరుతూనే వున్నాడు. కాని దక్కింది యీ నాటికి. చేస్తూ - చేస్తూ వకీలు వృత్తికి స్వస్తి చెప్పాడు. పోనీ తనకు చిన్నతనంనుండీ 'లలిత కళల' మీద అభిరుచిగదా! దానిమీద కృషి చేసి ప్రపంచానికి 'కళ'యొక్క విశిష్ఠత చూపుదామా అంటే, 'కళ' పేరు చెప్పితేనే ప్రతివాడు హేయ పడతాడు. తనకు 'కళ'ను గురించి తెలుసుకోవాలనీ - దానిలో ఆరితేరాలనీ - వున్నమాట వాస్తవమే. అందులో ముఖ్యంగా అభిమానమైన 'సాహిత్యం'లో బాగా కృషిచేసి యేదో రకంగా పేరు ప్రతిష్ఠలు - సమయానుకూలంగా ధనసంపాదన చేయాలని 'నవలా-గేయా' సాహిత్యంలో నానావిధాలుగా ప్రయత్నించాడు. ఫలితాన్ని చూపెట్టాడు చివరకు నాల్గయిదు నవలల్లో - రెండు సంపుటాల గేయాల్లో.

పెద్దకూతురు వివాహంచేసి కాపురానికి పంపాడు. రెండోకూతురు 'సుధ' విషయం విచారిస్తే కాళ్లు లేవు పుట్టుకతోనే. త్రోపుడుబండిలో కూర్చొని యిక్కడకు - అక్కడకు ఆ యింట్లో తిరుగాడగలదు. కాని తెలివితేటల్లో మాత్రం శ్రీధరంకన్న యెక్కువే. తండ్రిఛాయల్లోనే కవిత్వా వీధిలో తిరుగాడనారంభించింది. రజస్వలయిన నాటనుండి శ్రీధరం ఆమెకు పెండ్లి చేయాలని తహతహలాడుతున్నాడు. కాని

చేసుకునేదెవరు ? తెనుగు సాహిత్యంలో తనతోబాటు రాణిస్తోంది. ప్రతిరోజూ తనకు వచ్చినట్లే పత్రికా సంపాదకులనుండి కథలు పంపమని వుత్తరాలు వస్తూనే వున్నాయి. వాటితో యెలాగో ఫలితం దక్కించేది. దయదల్చి పంపే పారితోషికాలే ఆమెకు ఒకరకంగా జీవితానికి ప్రోత్సాహమిచ్చేవి. దాంతో యింట్లో గడవటానికి కూడా వీలవుతుండేది.

ముఖ్యంగా శ్రీధరంకి పట్టుకుంది మొండితనం ఒక్కటే. మొదట్లో యీ మొండితనంలేదు. తరువాత పరిస్థితుల మార్పుల్లో యీ మొండితనం మొన తేలటం మొదలెట్టింది. ఎంతకాలంబట్టో తనకుటుంబానికి ఆదుకుంటున్న మేనల్లునికిచ్చి 'సుధ'ను పెళ్ళి చేయాలని కాని అంతలో తగిలే గడ్డుసమస్య మనస్సుకు తృప్తికలిగించటంలేదు. "అంగవికలాంగురాలైన తన కూతురుకు వివాహమేచేస్తే - ఆవ్యక్తివల్ల మానసికానందం అతనెల్లా పొందగలడు!" ఇదే సమస్యమీద అతనెన్నో కథానికలు నవలా రచనలు చేసాడు. అదే సిద్ధాంతం తన స్వాంతానికి వచ్చేటప్పటికి 'సంఘం' అనేది అడ్డువచ్చింది. సంఘాన్ని కాదనలేదు. సంఘాచారాల్ని తప్పనలేదు. వ్రాతల్లోచూపే వుద్దేశ్యాలు చేతల్లో కొచ్చేటప్పటికి విముఖత్వం చెందుతున్నాయి. మేనల్లున్ని సంప్రదించాడు. పిల్లతరఫున వచ్చే 'రెండు కుంటలభూమి కోసం మేనల్లుడు శంకరం' రూపురేఖలు - విలాసాలు - వినోదాలతో నిమిత్తంలేదు. తల్లి మాటదాటలేని శంకరం వ్యక్తిత్వం విడిచిపెట్టి అమ్మకు చెప్పుకోని 'సుధ'ను వివాహం చేసుకుంటానికి ఒప్పుకున్నాడు. ఆస్తి పిల్లవైపున తరుముకోస్తోందిగదా అని శంకరానికి ఆనందం ఆగడంలేదు. శ్రీధరంకి స్వయంగా వెళ్ళి చెప్పుకున్నాడు - "మా అమ్మ ఊ" ... ! అందని శ్రీధరం తబ్బిబ్బయి పోయాడు. సంతోషం పట్టలేక పోయాడు. పోతే పోయింది రెండుకుంటలు, ఉన్న భారం తీరుతోంది గదా అని కన్న కుమార్తె మనస్సుకూడా తెలుసుకోకుండా వివాహం చేయ నిశ్చయించాడు. యీ నిశ్చయం యెంతవరకు తనగౌరవానికి - తన సిద్ధాంతాలకు - వ్యతిరేకమో గ్రహించుకోలేక పోయాడా ? తండ్రి మాటకు ఎదురు చెప్పటం చేతకాని 'సుధ' శంకరంతో మిథునలగ్నంలో మాంగల్యాన్ని కట్టించుకొంది. కాని వెక్కి వెక్కి ఒక్కసారి యేడ్చింది పెళ్ళయిన తరువాత, తండ్రిని తల్చుకొని.

ఒక నాడు 'సుధ' ఉదయం పదిగంటల వేళ 'వ్యథిత హృదయం' అనే కథ వ్రాస్తోంది. శ్రీధరం అప్పుడే భోంచేసి

వసారాలోకి వచ్చాడు. చుట్ట వెలిగించి పడక కుర్చీలో జారగిలపడ్డాడు. చుట్ట సగం కాలేటప్పటికి 'సుధ' కథ పూర్తి చేసింది. తండ్రివైపుకు తిరిగింది. శ్రీధరం చుట్ట పారేసి గ్లాసుడు చెరువుమంచినీళ్లు గటగట త్రాగి -

"సుధా! యేమిటో వ్రాసినట్టున్నావ్" అన్నాడు.

"ఆ .... ఏ ముంది నాన్నా! ఏదో కథ వ్రాశాను" — అంది.

"పేరేం పెట్టావ్?" — శ్రీధరం.

"వ్యధిత హృదయం" — సుధ. శ్రీధరం కథపేరు పెళ్లున వినేటప్పటికి ఒక్క నిట్టూర్పు విడిచాడు. ఆ నిట్టూర్పులో యేవో ఆశలు విఫలమైనట్లు పొడచూపాయి. కళ్లుజేవురుమన్నాయి. పట్టిన చెమటను పైటర్కీ తువ్వాలుతో అద్దాడు.

"నాన్నా" — అందామె

'ఉ' ....!—అన్నాడు. ఆలోచనల్లోంచి మేల్కొని.

"ఏమిటో ఆలోచిస్తున్నాట్లాగావుంది"- అంది సుధ.

"ఆ .... యేముంటాయి - " కథ పేరు వినంగానే కొంచెం పిచ్చి తలపులు రేకెత్తాయి.... అంతే" అన్నాడు శ్రీధరం.

"ఎందుకని నాన్నా"! —

శ్రీధరం జవాబివ్వలేక పోయాడు.

"సుధా! కథ చదువూ—" అన్నాడు వెంటనే శ్రీధరం.

రెండు ముక్కల్లో కథను తీర్చేసింది. శ్రీధరం నివ్వెరపోయాడు. తను చేసిన వెధవపనికి యిప్పుడు సిగ్గుపడ్డాడు; లాభం?

ఇల్లా కథవ్రాసి తనకు పశ్చాత్తాపం కలిగించ తల్చుకుందా? లేక మానాన్నారు యిలా నాజీవితం పాడుచేశారని ప్రపంచానికి తెలియజేయాలనుకుందా? అలా ఎదురుగా ప్రవర్తించడానికి ఎప్పుడూ తన మాటకు ఎదురు చెప్పలేదే! మరి యేమిటిది!

సుధ యొక్క వ్యక్తి గత జీవితం ఒక్కటే ప్రతిబింబింప చేసిందా కథలో. "సమాజంలో వ్రాతలు ఎంత హాయిని గొల్పుతాయో — చేతలో అంత బాధను చేస్తాయి. శ్రీధరంకన్నకూతురుకు ద్రోహం చేశాడు. సమాజానికి వెరచి సుధకు స్వేచ్ఛ లేకుండా చేశాడు. ఒకవేళచేసినా ఆమె వలన మానసికానందం ఎలాగైనా లభింపదుగదా! కాకపోతే శ్రీధరానికి తీరింది కూతురు భారం. ఇదేవిధంగా అయితే శ్రీధరంకి కూతురు బదులుగా కుమారుడే వుంటే కుంటిపిల్లను తీసికొచ్చి చేస్తాడా?

అందువలన యెందుకు యింత పాడుపని చేయాలి ?'' అంటూ యింకా కొన్ని విషయాలు ఆ కథలో స్పష్టపరచింది. చివరకు కథలోనే, ''కన్నకూతురు హృదయం తెలుసుకోలేని మూర్ఖులు యింకా చాలా మంది వున్నారని-'' 'స్త్రీ'అంటే యేమిటో తెలుసుకోకుండా — ఆమె ప్రత్యేకంగా వంటయింటి కుందేలుగా విలాసకృత్యానికి వుపయోగించే ఆట బొమ్మగా - స్వేచ్ఛలేని బానిసగా తల్చారని వ్రాసింది. స్త్రీలకు కూడా విజ్ఞానతృష్ణ వుంటుందని - వ్యక్తిగత జీవితాలపై ఎంత బాధ్యత వుండి వున్నదో — ఏది మంచో - చెడో - యే విషయం అంగీకరించాలో - యేది కూడదో యిటువంటి విషయాలలో హక్కువుందని కన్న తండ్రులంగదా అని అంగవికలాంగులైన కుమార్తెలకు యిష్టంవచ్చినట్లు, ఎటువంటి సంప్రదింపులు లేకుండా యెవరికో ధనం గలవాడికి అంటగట్టటం - భారం తీర్చుకోవాలని ప్రయత్నించడం వివేకులయినవారికి తగిన పనికాదంటూ'' కథను ముగిస్తూ - కథలోని కథానాయికచేత ''ఆస్తికోసం నన్ను వివాహమాడారు - నేను యేవిధంగాకూడా మానసికంగా ఆనందాన్ని యివ్వలేను - పొందలేను - అందువలన మీరు పరోక్షంగా ప్రవర్తించవచ్చు - కాని అదే చనువుమీద నా జీవితాన్ని నాశనంచేసి - నన్ను మరిచిపోయి నన్ను వేరుగాభావించవద్దు'' అంటూ భర్తకు నివేదించుకున్నట్టు తన మనవిని కథా సంపూర్ణం చేసింది.

సుధ లేనివేళ ఆ కథచదివి శ్రీధరం యేడ్చాడు. దాని ఫలితంగా ''తప్పునాదే'' అనే కథానిక వ్రాసి, కూతురుతో కూడా 'తప్పునాదే' అని నోటితో అన్నాడు. సుధ కన్నీళ్లు కార్చింది. శ్రీధరం ఖిన్న వదనుడై యెంతపని చేసానని ఖేదపడ్డాడు. లాభం ?

